శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కల్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:1 సంచిక:3 త్రైమాసిక పత్రిక జూన్ - 1998

సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!



ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన
హృదయ కుహరంలోని
నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి.
ప్రణవనాద వీచికల్లా
సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!

ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన
మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు
అంతటా నిరంతరం
వర్షించాలి! ఆ ప్రేమామృత
ధారలలో తడుస్తూ, ఆ
జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*****************************************************************************************

ఈ సంచికలో


1. సాయివంటి దైవంబులేడోయి!లేడోయి
2. ఉన్నమాట - అనుకున్నమాట - — గురు బంధువులు
3. విశ్వాస ఫలం — కె.వాసు, U.S.A
4. 12-4-98 న — జి.రత్తయ్య
5. చదివేటి వాళ్ళకేం కోర్కెలుంటాయి — అద్దంకి శిరీష
6. నాకేం కావాలన్నా గురువుగార్నే అడుగుతా — అద్దంకి స్నేహిత
7. శ్రీగురుదేవులుతో నేను పొందిన అనుభూతి — ముసునూరు కోనయ్య చౌదరి
8. లక్ష్మణాంశ — గురుచరణదాసుడు
9. జోరున వాన - ఆగని సత్సంగహేల — 'విస్పందన'
10. ఫోటోసే వారు — శాఖమూరి సీతారావమ్మ
11. ఆ చేయి ఎంత హాయి — డా||జి.సాయివరప్రసాదరావు

# ఉన్న మాట - అనుకున్న మాట

సాయినాథుని కృపాకటాక్షంతో "గురుకృప" మూడవ సంచిక మీ ముందుకు వచ్చింది. గురుబంధువులందరు అందిస్తున్న సహకారం "మరువరానిది" పిడుదలైన రెండు పత్రికల వలన "గురుకృప" పరిచయము, పత్రిక యొక్క ప్రధానోద్దేశ్యము వైపు అడుగులు వేస్తూంది. పత్రిక యొక్క ప్రధాన ధ్యేయాన్ని గురు బంధువులందరి దృష్టికి తీసికొని రావాల్సిన తరుణ మాసన్నమైనది.

సద్గురుని చర్యలు అగాధాలు. ఎవరైతే సద్గురు లీలలను మననం చేస్తూ అందులోనే మునిగిపోతారో వారికి జ్ఞాన రత్నాలు లభిస్తాయి. అలా జ్ఞాన రత్నాలుగా లభించిన గురులీలలను అందరికి పంచటము, మన త్రికరణాలను సాధ్యమైనంత సేపు సాయి ఊసులో, సాయి ధ్యాసలో ఉంచుకొనే ఉపకరణం.

"భక్తులకు ఐహికంగాను, ఆముష్మికంగాను లాభం చేకూర్చటానికే మహాత్ములున్నది" అనే బాబా పలుకులను నిజం చేస్తున్నారు మన మహిమాన్వితమైన "శక్తి" మన "సద్గురు". గురుబంధువులు అలా పొందిన లీలలను సాయి భక్తులందరికి పంచటమే "గురుకృప" ధ్యేయం.

ఈ సంచికలో గురు బంధువులు పొందిన అనుభవాలను, లీలలను, మరియు హైద్రాబాద్ మందిర ప్రారంభ పిశేషాలను సాయి భక్తులకు అందిస్తున్నాము.

ఆధ్యాత్మికత అంటే అది ఏదో పెద్ద దయ్యంగా భావిస్తుంటారు. దానికి వయసును ఆటంకంగా చూపిస్తుంటారు. ఎవరైనా పిల్లలు భక్తిగా వుంటే వారిని గేలిచేస్తు "అరే పీడు అప్పుడే ముసలి వాడయినాడు ఇక సన్యాసులలో కలసి పోయినట్లే అంటూ, ఇంకా చాలా వయస్సు వుంది ఏమి తొందర. పిల్లలను భగవత్ స్వరూపులుగా భావిస్తాము. మరి అటువంటి పిల్లలలో భగవదర్చన చిన్ననాటి నుండే వుంటె, వారి జీపితం ఆనందదాయకంగా అభయ ప్రదాయంగా వుంటే మనకు నష్టమా!

నేడు అనేక మంది గురుబంధువులు గురూజీని దర్శిస్తు వారి పిల్లలలో కూడా సాయితత్వం వైపు జిజ్ఞాసను కలిగిస్తున్న శరణాగతి పథం వైపు నడకలు నేర్పుతున్నారు అనటంలో అతిశయోక్తి లేదు. ఈ సంచికలో అలాంటి ఆర్తి, జిజ్ఞాస కలిగిన ఇద్దరు పిల్లలు తమ అవగాహన, ఆలోచన, గురూజీతో వారు పొందిన అనుభవాలు, అనుభూతులను "గురుకృప"కు తెలియజేయటం ఎంతో ఆనందదాయకం.

ఏదైనా ఒక పత్రిక ప్రారంభించాలంటే ముందు చందాదారులను పెతకాలి. గురుకృప పారంభంలో ఈ పత్రిక యొక్క మొదటి నాలుగు సంచికలు ఉచితంగా యివ్వదలచినాము. ఆ నేపథ్యంలో పత్రిక పొందిన ప్రతివారు అడిగే మాట "దీని సంవత్సర చందా ఎంత?" అని క్రొత్త వారికి పుస్తకము ఇవ్వగానె "ఎంత యివ్వమంటారు?" అని నేడు గురుకృపకు లభిస్తున్న ఆదరణ ఇది.

తొలి సంచికలో వ్రాసినట్లు " మనకై మనమే నడుపుకొనటం ఈ పత్రిక ప్రత్యేకత" అన్న దానిని నిజం చేస్తు ఎందరో "గురుకృప" చందాదారులుగా చేరటానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇంతకంటే ఏమి కావాలి పత్రిక పేరు సార్థకం కావటానికి.

దీనిలోని లీలలను మీరు చదిపి, పది మంది చేత చదిపించటమే ప్రస్తుతం మీరు కట్టే అసలయిన చందా.

- గురుబంధువులు

## విశ్వాస ఫలం

గురుబంధువు వాసు గత రెండు సంవత్సరాలుగా గురువు గారినే శ్రద్ధ - సబూరిలతో ఆశ్రయించి ఆరాధించాడు. అమెరికా వెళ్ళాలనే తన కోరిక తీరేదాకా తనకి అతి ప్రియమైన అరటి పండు తిననని నియమం పట్టాడు. వీసా కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. వీసా రావటానికి ఒక వారం ముందు గురూజీ "పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లుగా" వాసుని తన వద్దకు రప్పించుకున్నారు. శిరిడిలో గురువుగారి దర్శనం తరువాత వారు అరటిపండు ప్రసాదంగా ఇచ్చారు. అరటిపండుతో బయటకు వచ్చిన వాసు గురుబంధువు రత్తయ్య గారికి తన అరటిపండు నియమము తెలిపి ఏమి చెయ్యమంటారు అని అడిగారు. గురుజీ అరటిపండు ప్రసాదంగా ఇవ్వటంలోని అంతర్యం నీకు గ్రీన్ సిగ్నల్ USA కి వచ్చినట్లే, ఆనందంగా ఆరగించు అని చెప్పారు. అటు తరువాత పనులన్నీ పూర్తికావటం, వీసా రావటం, అమెరికా వెళ్ళటం ఒకదాని వెంట ఒకటి వెంటవెంటనే జరిగిపోయాయి. అమెరికా వెళ్ళాలనే తన కోరిక నెరవేరబోతోందని తెలియజేయటానికే గురూజీ ఆనాడు అరటిపండును ప్రసాదంగా ఇచ్చారన్న సంగతి అటు తరువాత గానీ వాసుగారికి అర్థం కాలేదు.

ఇప్పుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గురుబంధువు వాసు గురువుగారిపై విశ్వాసంతో తను చేసే ప్రతిపనీ బాబాకి చెప్పి చేస్తూ ఎలా అనుకూల ఫలితాలు పొందుతున్నారో స్వయంగా వ్రాసి పంపిన వారి అనుభవాలను చదివితే బాబా లీలలు అర్థం అవుతాయి.

*Car విషయం :* Car కొనాలన్న ఆలోచనే లేనప్పుడు ఒకసారి ఊరికినే Car Company కి కారు చూడటానికి వెళ్ళాము. అప్పుడు Lesabee అనే కారు చూసాను. బాబాని అడిగాను. బాబా "నీ దయవలన Settle అయి అటువంటి Car కొనుక్కొనే Capacity ఇవ్వు తండ్రి" అని అలా ఒకదానికొకటి కలిసి వచ్చి అంత తక్కువ Price లో Baba ఇప్పించారు. చాలా Extra feature తో వచ్చింది ఆ Car. మామూలుగా అయితే వాటిలో చాలా తీసుకోము. But Pep Car అవ్వటం వలన బాబా అన్నీ అమర్చి చాలా తక్కువ Price లో ఇప్పించారు. నిజంగా ఆయన లీల అది.

*ఉద్యోగ విషయం :* January, 5th తర్వాత holiday season అయిపోయింది. నేను Interview Calls కొరకు ఎదురుచూస్తున్నాను. January, 22nd వరకు నాకు Encouraging Calls ఏమీ రాలేదు. రోజూ బాబాని అడిగేవాడిని ఉద్యోగం ఇప్పించు అని, కాని Reply ఏమీలేదు. కాని ఆ రోజు గురువారం భజన చేసుకొని బాబాతో ఇలా అన్నాను. బాబా ఈ రోజు నాకు నీవు ఏమి Interview ఇప్పించలేదు అంటే ఇహ నాకు నామీద నమ్మకం పోయినట్లే, నేను Mechanical field లో Try చేయటం నీకు ఇష్టం లేదు అన్నమాట, కాని ఒకటి నా field నాకు Interest, నిన్నే నమ్మాను. శరణు అంటున్నాను ఇహ నీ ఇష్టం. ఈ రోజు నాకు Turning అవుతుంది అని నమ్ముతున్నాను నీ దయవలన అని పూజ ముగించాను. వెంటనే మధ్యాహ్నం మూడు Interviews వచ్చినవి. అందులో Multi Arc ఒకటి నాకు Job offer ఇచ్చింది. ముగ్గురు Impress అయ్యారు initial గా One week లో మా Managers Call చేస్తారు Second Interview అని చెప్పారు. ముగ్గురు Next week Second Interview conduct చేసారు అన్నీ Telephonic Interviews. ముగ్గురు మరల Impress అయ్యారు we shall have another Interview in a week అన్నారు.

Multi Arc మాత్రం 28th న రమ్మన్నారు Personal Interview కి. వాళ్ళు బాగా Satisfy అయ్యారు. But నా H1 Visa కొంచెం Confusing గా ఉండి అది తేలితే కాని చెప్పము అన్నారు. అలా 4 రోజులు జరిగిపోయినాయి. మొన్న Monday ప్రొద్దున్నే బాబాకి నమస్కారం పెట్టుకుని ఎందుకు బాబా అక్కడవరకు వచ్చిన దానిని ఆపావు, కారణం లేకుండా ఏమి చేయవు ఈ రోజు నాకు అది తేల్చి చెప్పు అని అడిగాను. ఊది పెట్టుకొని

పూజ దగ్గర నుండి లేచాను. Phone వచ్చింది. ఏంటా అని చూస్తే Confirm చేస్తున్నాము నీ Job అన్ని మేము మాట్లాడుకున్నాము H1 Visa OK అయింది అని చెప్పారు. ఆ Company వాళ్ళు ఎప్పుడు Join అవుతావు, 9th నుండి Start చేయాలి అని చెప్పారు. కాని నేను 12th నుండి Start చేస్తాను అని చెప్పాను. బాబాకి Thanks చెప్పాను. ఏది మంచిదో అది చేయి బాబా అని చెప్పాను. ఈ రోజు రెండో Company వాళ్ళు Speaker Phone లో ఇద్దరు కలిసి Final Interview చేసారు. Interview బాగా చేసాను. బాబా ఆ శక్తి ఇచ్చాడు. వాళ్ళు కూడ Satisfy అయ్యారు. రేపు గురువారం కాని శుక్రవారం కాని చెబుతాము అన్నారు. ఆయనను పూర్తిగా నమ్మి ఆయన మీద భారం వేసి వెంటనే మర్చిపోయాను. నేను బాబాని అడిగాను, బాబా ఈరోజు విషయం తేల్చి నాకు అనుభవం ఇవ్వు అని, అంతే వెంటనే ఇచ్చేసారు. అలా బాబా అనుగ్రహంతో అమెరికాలో ఉద్యోగం పొందాను.

K. Vasu, USA

## 12-4-98 న

"నా భక్తుడిని నేనే ఎన్నుకుంటా" అన్న బాబా పలుకులను నిజం చేస్తూ నేడు బాబా తన భక్తునిగా డాక్టర్ శరత్ బాబూజీని ఎన్నుకొని కార్యోన్ముఖుని చేసి సద్గురు పీఠంపై అధిరోహింపచేసి వారి ద్వారా ఎందరో భక్తులకు "సాయి" దాహార్తి తీరేటట్లు చేసిన ఆ ద్వారకామాయీశుని కృపకు మనం కృతజ్ఞులం కాక తప్పదు.

1993లో తెనాలిలో దత్తసాయి మందిరంలో విగ్రహప్రతిష్ఠ తరువత, అంటే 5సం||ల వ్యవధి తరువాత హైదరాబాద్ నగరంలో శ్రీ సాయి దివ్యారామాన్ని ప్రారంభించే సమయంలో సద్గురు శరత్ బాబూజీని సాయిభక్తుల మధ్య మరల చూచే భాగ్యం భాగ్యనగరంలో లభించింది. కమిటీవారి కార్యసాధనో, దేవాలయ ప్రాంగణ మహిమో, లేక మరేదో అంతర్గత శక్తో కాని గురువుగారి రాకను పొందే భాగ్యం భాగ్యనగానికి దక్కింది.

"గురువుగారు శిరిడీనుండి హైదరాబాద్ బయలుదేరుతారు" అన్న విషయం తెలిసి శిరిడీ వెళ్ళి వారి దివ్య దర్శనం చేసుకొని "మేముకూడా మీ కారుతోబాటు హైదరాబాదుకు మీ వెంటవస్తాము" అని కోరుకొన్నాను. నా కోరికను వారు మన్నించటంతో నాకు కలిగిన ఆనందం వ్రాయనలవి కానిది.

ది 10-4-98 తెల్లవారుజామున 2.00 గంటలకు హైదరాబాద్ ప్రయాణానికి ముందు శ్రీబాబూజీ ద్వారకామాయిలో కూర్చొని ధ్యానం చేసుకొన్నారు. మరల అచ్చట నుండి గురుస్థానానికి వస్తూ మధ్యలో తలుపులు మూసివున్న మందిర ద్వారం (గురుబంధువులు అందరు ముద్దుగా VIP ద్వారదర్శనం అని పిలుస్తారు) వద్ద నిలబడి ద్వార దర్శనం చేసుకున్నారు. శ్రీ శరత్ బాబూజీయే సాయినాథునిగా భావించే నావంటి వారికి ఈచర్యలు చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి. సాక్షాత్తు దేవదేవుడైన శ్రీరాముడు శివధనుర్భంగానికి ముందు శివుణ్ణి ప్రార్థించిన పురాణగాధ నాకు స్ఫురణకు వచ్చింది.

మనమంతా షిరిడి నుండి తిరుగుప్రయాణం అవుతూ వారి అనుమతి కోరుతాం. మరి వారు తన ప్రయాణానికి "బాబా" అనుమతి కోరుతూ నమస్కారం చేసారన్నమాట. వారి ఆచరణ మనకు మార్గదర్శకమే కాకుండా సాయిపథాన్ని మనకు చూపటంకూడా. గురువుగారు అలా బాబా అనుమతి కొరకు నమస్కారం చేస్తున్న దృశ్యం కన్నుల పండుగగా తిలకించటంలో అంతులేని ఆనందానుభూతి ఉంది. ఒక సద్గురువు వద్దకు చేరినందువల్ల నేను పొందిన ఆ ఆనంద దృశ్యం నా మనసులోనేకాక నా కెమెరాలో కూడా బంధించుకున్నాను. ఆ అవకాశం సద్గురు నాకందించిన "గురుప్రసాదం". "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే వుంటాను! నేను ఇవ్వదలచింది వారు అడిగేంత వరకు."

అలా సమాధి మందిరం వద్ద నమస్కారం చేసుకొని గురుస్థానంలో హృదయధ్యానం చేసుకొని నింబ వృక్షం వద్ద మోకరిల్లినప్పుడు "సూర్య నమస్కారమా" అనేలాగా కనబడ్డ ఆ దృశ్యం అతి మనోహరం. వారిని అనుసరిస్తున్నందువల్ల కలిగిన ఈ భాగ్యానికి మురిసిపోతూ మా కారులోని వారందరము బాబా నామం చెప్పుకొంటు ఆ రోజు ఉషోదయం తరువాత హైదరాబాద్ చేరటం జరిగినది.

400 సం|| చరిత్ర దాటిన హైదరాబాద్ మహానగరంలో ది 12-4-98న భక్తజన సందోహం మధ్య గురుదేవులు భక్తి ప్రపత్తులతో బాబా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి తనదివ్య మంగళ హస్తాలతో హారతి పట్టారు. కర్పూర కాంతులు, సాయిదేవుని దివ్యకాంతులు, శరత్ బాబూజీ ధవళకాంతుల సమ్మేళనాన్ని చూడగలగటం అక్కడ చేరిన అశేషభక్తుల అదృష్టంకాక మరేమిటి?

ఎన్నో ఆశలతో, కోరికలతో, భక్తితో అచ్చటికి చేరిన నగరవాసులకు, గురుబంధువులకు రెండురోజుల దర్శన భాగ్యాన్ని కల్గించి, సమస్యల నుండి ఉపశమనాన్ని పొందటానికి వచ్చిన ఆర్తుల హృదయభారాన్ని తగ్గించి, భక్తుల వ్యధలను కరుణతో స్వీకరించి శరత్ బాబూజీ తన భాగ్యనగర పర్యటనలో అనేకమందికి ఊరట కలిగించారు. భాగ్యనగరాన్ని తన పాదస్పర్శతో పునీతం చేసిన సద్గురువుకి పాదనమస్కారం చేసుకొని ఎందరో తరించారు. ఈ సుందర దృశ్యాలను ప్రత్యేకంగా తిలకించలేని గురుబంధువులకు తెలియజేయటం, "గురుకృప" అదృష్టం.

గట్టా రత్తయ్య, తెనాలి.

## "చదివేటి వాళ్ళకేంకోర్కెలుంటాయి"

చదువుకొనే చిన్నారులకు సైతం గురుసన్నిధిలో వారెంతో పెన్నిధిని పొందుతారు. తామప్పుడు పొందింది ఎలాంటి పెన్నిధో వారూహింపగల్గే వయస్సు కాదది. ఎందుకు నీకు ఆయనంటే ఇష్టం అని చిన్నారి శిరీషని ప్రశ్నించినప్పుడు వ్రాత పూర్వకంగా వ్రాసిచ్చిన కాగితం మీది అనుభూతిని చదివినప్పుడు ఆ సద్గురుదేవులు, "సాయి సాధనా స్వరూపి" డాక్టరు సాయినాథుని శరద్బాబూజీగారి ప్రేమ ఎంతటిదోనని చెప్పేందుకు చెమర్చిన నాకళ్ళు నాకు సాక్ష్యం చెప్పాయి. శిరీష తన అనుభూతిని ఇలా వ్రాసిచ్చింది.

"నా స్నేహితులతో కల్సి మొదటి సారిగా శిరిడీకి వెళ్ళినప్పుడు గురుస్థానం వద్ద ఎన్ని ప్రదక్షిణలు చేయమంటారని గురువుగార్ని అడిగినాను. నా స్నేహితులకు ఎన్ని ప్రదక్షిణలు చేయాలో చెప్పారు. నాకు మాత్రం చేయగలిగినన్ని చేయమన్నారు. ఎందుకలా అన్నారో అర్థంకాలేదు. ఆ రోజు రాత్రి నేను ఆశ్రమం వద్ద అనుకోకుండా పడ్డాను. అప్పుడు కాలు పట్టుకొని పోయింది. ప్రదక్షిణాలు చేయలేక పోయాను. అప్పుడు నాకర్థమైందేమంటే గురువుగారి మహిమలు ఇలావుంటాయని, నాకెందుకు అలా చెప్పారో నాకు అప్పటికిగాని అర్థంకాలేదు.

"గురువుగారు తిరుమలకు వచ్చినప్పుడు వారిని దర్శించాను. రెండవరోజు వారి దర్శనార్థమై వెళ్ళి వచ్చేటప్పుడు నాకు ప్రసాదంగా రెండు "స్వీట్లు" ఇచ్చారు. వాటిని తినలేక పారేద్దామనుకొన్నాను. మూడోరోజు దర్శనార్థమై గురువుగారి దగ్గరకు వెళ్ళినప్పుడు నాతోటి వారందరికి ప్రసాదం ఇచ్చారు. కాని నాకు మాత్రం ఇవ్వలేదు.

బయటకొచ్చి ఆలోచించగా నా ముందటి రోజు మాటలు (ప్రవర్తన) గుర్తుకు వచ్చి బాధపడ్డాను. క్షమించమని ప్రార్థించాను. ఆ మరుసటి రోజు మళ్ళీ దర్శనానికి వెళ్ళాను. ఈ సారి చేతికి ప్రసాదం అందించారు.

గురుమహిమంటే ఏమిటో అర్థమైంది. మనం వారికి ఎదురుగా లేకున్నా పరోక్షంగా మన మనుకొనేవన్నీ వారికి తెలుస్తాయనిపించింది.

చదువుకొనే వారికి కోరికలేముంటాయి. బాగా చదవాలనేగా! గురువుగారి ఆశీర్వచనం వల్ల బాగా చదువుకొనుచున్నాను.

మానాన్న గార్కి గతంలో కోపం అధికంగా వుండేది. గురువుగారిని సేవించటం మొదలు పెట్టినప్పటినుండి మా నాన్నలో కోపం బాగా తగ్గింది. తండ్రికి కోపమెక్కువుంటే పిల్లల వీపుకు చేటని మీకు తెలియదా? నా వీపును రక్షించిన మా గురువుగార్కి Thanks.

- అద్దంకి శిరీష.

## నాకేం కావాలన్నా గురువుగార్నే అడుగురాను

సద్గురువు యొక్క అనుగ్రహం సర్వత్రా నిండివుంటుంది. అన్నింటియందు సమానంగానే అనుభూతమౌతుంది. దాన్ని గ్రహించే గుణం కొందరికి మాత్రమే ఉంటుందని, పసిపిల్లల్లో అధికంగా వుంటుందని "స్నేహిత" యొక్క అనుభవం మనకు నిరూపిస్తున్నది.

స్నేహిత వయసు 6 సంవత్సరాలు. 1993వ సం. లో పరమ పావనమైన పూండీ క్షేత్రంలో పూండీ స్వాములవారు 18 సం. "అజగరావస్థ" స్థితిలో ఉండి సమాధిచెందిన తావున "శ్రీ సాయిసాధనా స్వరూపులు" సాయినాథుని శరద్బాబూజీగారి చేతి మీదుగా, గురుబంధువుల సమక్షంలో అక్షరాభ్యాసం జరిగింది. ఆ పసిపాప పసిహృదయంలోంచి పెల్లుబికిన అక్షరాకృతిని మీ ముందుంచాము.

"నాకు శరద్బాబూజీ" అంటే భలే ఇష్టం వారికి బాబా అంటే మహా ఇష్టం. అందుకని నేను "హోంవర్కు"(స్కూలుకు సంబంధిచినది) చేసేటప్పుడు "బాబా బాబా" అంటూ చేస్తాను. ఏదైనా తపున్నచో మా "మేష్టార్" గారు ఏమీ అనరు. పరీక్షలప్పుడు మా "సార్"(శరద్బాబూజీ) ఇచ్చిన ఊదీని నోట్లో వేసుకుంటే మర్చిపోయినవి ఠక్కున గుర్తుకువస్తవి.

వ్యాపారరీత్యా మా "డాడీ" వూరెళ్ళినప్పుడు మా "డాడీని" త్వరగా పంపించండని మా సార్ ని అడిగితే, అడిగిన వెంటనే "డాడీ" ఇంటికి వస్తారు.

ఒకసారి "సార్ ని" (దగ్గరగా ఉన్నప్పుడుగాదు) పటం ముందు నుంచొని "చూయింగమ్స్" (చప్పరించి బూరలా వదులుటకు అవకాశముండే బిళ్ళలు) కావాలని కోరితె ఎవరో వచ్చి ఇచ్చి వెళ్ళారు.

"అద్దంకి స్నేహిత"

## శ్రీ గురుదేవులు శరత్ బాబూజీతో నేను పొందిన అనుభూతి

నేను మొదటి నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పూజిస్తూ వుండేవాడిని. అందులో భాగంగానే, మా మిత్రులు డాక్టర్ R. శ్రీనివాసాచార్యులు గారితో కలిసి అనుకోకుండా, అన్ని పరిస్థితులు అనుకూలించక పోయిన వారి మాట కాదనలేక తిరుపతికి వారితో కలిసి వెళ్ళటం జరిగింది. 1996 మార్చి 12వ తేదీన అచ్చటికి వెళ్ళిన తరువాత మేము విడిది చేసిన వైఖానస ఆశ్రమం మేనేజరు శ్రీ ప్రభాకరాచార్యులు గారు మీ తెనాలి నుండి 2,3 బస్సులలో శ్రీ శరత్‌బాబు గారిని చూచుటకు, వారి ఇంటర్వ్యూలు పొందుటకు భక్తులు వచ్చినట్లును,

అలాంటి యోగి పురుషుని చూచుటకు వారు కూడా వెళ్ళినట్లును చెప్పియున్నారు. నేను కూడా వారితో మాటల సంధర్భమున వారు అడిగినప్పుడు శరత్‌బాబు గారిని గురించి నాకు అంతగ తెలియదు. కానీ ఈ మధ్య మా తెనాలిలో వారిని గొప్పగా పూజించటం, పెద్ద పెద్ద బానర్లు కట్టి వారికి స్వాగత వచనములు వ్రాయటము, భక్తులు వారిని చూసారని విన్నాను, నేను ఇంటికి వెళ్ళే దారి అదే అయినా శ్రీ సాయిబాబా గుడికి వెళ్ళి వారిని చుడాలనే ఉచ్చుకత నాలో కలుగలేదు. అయినా నా భార్య, నేను వారి పాదనమస్కారములు చేసుకొన్నాను, మీరుకూడా వెళ్ళి వారిని దర్శించి నమస్కరించండి అనికూడా చెప్పినది. అయినా నాకు వారిని చూడాలని అనిపించలేదు. ఈ సారి అంటే తిరుపతి వెళ్ళినప్పుడు శ్రీ ప్రభాకరాచార్యులు గారు చెప్పిన తరువాత, మా మిత్రులు డాక్టర్ శ్రీనివాసాచార్యులు గారు కూడా వెళదామని ఆసక్తి వ్యక్తం చేసిన తరువాత వారి దర్శనమునకు వెళ్ళాము. అప్పటికే చాలామంది భక్తులు వారి ఇంటర్వ్యూకు వెయిటింగ్ లో ఉండటం చూశాము. అయినా మాకు శ్రీ వైఖానస ఆశ్రమం మేనేజరుగారు అప్పటికే వారి దర్శనం చేసి ఉండుట వలయును, అచ్చటి వారితో మాట్లాడి ఇంటర్వ్యూకు పంపినారు. డాక్టర్ శ్రీనివాసాచార్యులు గారు అమెరికాలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్నట్లుగను, వారి పిల్లలు శ్రీ షిరిడీ సాయిబాబా వారి సత్‌చరిత్ర పారాయణము చేసి, పారాయణ అనంతరం దక్షిణగా వారికి పంపదలచిన డబ్బులు(డాలర్లు) వారి పిల్లలు అమెరికా నుండి ఇండియాకు వచ్చిన శ్రీనివాసాచార్యులు వారి ద్వారా పంపినట్లుగాను, ఆ డాలర్స్ ప్యాకెట్ ను శ్రీ శరత్‌బాబు గారికి అందజేయగా వారు ఆ డాలర్స్ ప్యాకెట్ ను కనీసం తాకను కూడా తాకకుండా వివరములు అడిగి షిరిడీ సంస్థానమునకు M.O. ద్వారా పంపవలసినదిగా చెప్పినారు. ఆ తరువాత వారి ఆశీస్సులు పొంది వారు ఇచ్చిన ఫలములు స్వీకరించి ఆ గది నుండి బయటకు వచ్చినాము. అలా వచ్చిన తరువాత మాకోసం బయట వేచి ఉన్న వైఖానస ఆశ్రమం మేనేజరు శ్రీ ప్రభాకరాచార్యులు గారు వివరములు అడుగగా జరిగినవి చెప్పినాము. వారు అప్పుడు మరికోనయ్యగారు ! మీరేంచేశారు అని అడుగగా నమస్కరించి వారు ఇచ్చిన ఫలములు తీసుకు వచ్చానని చెప్పారు. అప్పుడు వారు అదేమిటండీ మీరు ఇన్ని బాధలలో ఉండి వారికి ఏమీ చెప్పుకోకుండా ఎలా వచ్చారండి అంటూ, శ్రీనివాసాచార్యులు గారితో మీరైనా కోనయ్యగారి పరిస్థితి శరత్‌బాబు గారితో చెప్పక పోయారా! అని అనటం జరిగింది. అప్పుడు నాకు అనుకోకుండా మరలావారి వద్దకు వెళ్ళి మా కష్టములు చెప్పుకుందామనిపించింది. నేను వెంటనే మిత్రులు శ్రీనివాసాచార్యుల గారితో వారితో మాకష్టములు నేనుగా చెప్పుకోలేను, అది నా బలహీనత కనుక మీకు నా పూర్తి పరిస్థితులు అన్ని తెలుసు మీరుగా మా పరిస్థితులు మనవి చేయవలసినదిగా కోరాను. వారుకూడా నా ఆవేదనను అర్థం చేసుకొని స్పందించారు. మరలా ఇంటర్వ్యూకు వెళ్ళుటకు అతికష్టము మీద లోపలికి వెళ్ళుటకు అనుమతి అంటే(అప్పటికే చాలామంది భక్తులు వెయిటింగులో ఉండగా) మాకు ఇంటర్వ్యూ లభించటం మా అదృష్టంగా భావించాము. సరే లోపలికి వెళ్ళిన మీదట మేము ఒక గంటము ముందే మీ వద్దకు వచ్చినట్లుగాను, మీ ఆశీస్సులు పొందినట్లుగాను అయినా కొంతతృప్తి కలిగనందున మరలా మీవద్దకు వచ్చినట్లు, ముఖ్యంగా ఇందాక మీ వద్దకు వచ్చినప్పుడు మా మిత్రులు కోనయ్యగారి కష్టములు చెప్పలేదని, దాదాపు 10, 12 సం.లనుండి చాలా బాధలు ఆయన అనుభవిస్తున్నాడని వివరములతో కాకుండా అవుట్ లైన్స్ గా శ్రీనివాసాచార్యులు గారు శ్రీ శరత్ బాబుగారితో చెప్పటం జరిగింది. అప్పుడూ శ్రీ గురుదేవులు శరత్‌బాబుగారు తదేకదీక్షతో నాముఖం వంక చూడటం, నాకు తెలియకుండానే పెద్ద పెట్టున ఏడుపు నాకు రావటం జరిగింది. ఆ ఏడుపుతోనే నా కష్టములు నేను చెప్పుకోలేననుకున్న నాకు, నాకునేనుగా వారికి నా ఆవేదనను తెలియజేసుకున్నాను. వెంటనే నన్ను వారు సైగలతోనే ఓదార్చి శ్రీ షిరిడీ సాయిబాబాగరి చిత్రపటం తీసి చాలాసేపు ఆ పటం చూసినారు. వారి యోగ దృష్టితో ఆపటం కళ్ళకు అద్దుకొని నాకు ప్రసాదించి ఆశీర్వదించినారు. నాకు ఇలాంటి అనుభూతి మా నా 61 సం. వయస్సులో భగవంతుడు కలుగజేసినది. ఇలాంటి అనుభూతి, స్పందన నాలో కలగటం ఇదే మొదటిసారి, నా యీ అనుభూతియొక్క వివరములు చెప్పేముందు నేను తిరుపతికి వెళ్ళే ముందు నా ఆరోగ్య పరిస్థితి సరిలేదు, ముఖ్యంగా నాకుడి అరికాలు 10 సం.ల నుండి నీరు కారుచూ చీములు పట్టి, వాపులతో బాధపెడుతూ దీర్ఘకాల వ్యాధిగా మారింది. నేను ఎన్నో మందులు ఆయుర్వేదంలోను, ఇంగ్లీషులోను, హోమియోలోను వాడి వున్నాను. కానీ మందులు పని చేయలేదు. హోమియో వాడుతున్నప్పుడు మాత్రం తగ్గుతూ మరలా వస్తు ఈ వ్యాధి బాధిస్తూనే ఉంది.

అలాంటి పరిస్థితులలో కాలికి కట్టుగుడ్డ కట్టి తిరుపతి ప్రయాణం చేశాను. తిరుపతి వెళ్ళిన తరువాత కూడా నా ఈ ఇబ్బందిని శ్రీనివాసాచార్యులు గారు, వారి శ్రీమతిగారు చూచి నన్ను జాగ్రత్తగా పసిపిల్లవాడిని నడిపించినట్లుగా నా వెంట ఉండి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించటం జరిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, వారితో వ్యాధిని గురించి చెప్పటం జరగలేదు. మొత్తం మీద కష్టములలో ఉన్నట్లు చెప్పినాను. వారిని కలవటం వారి ఆశీస్సులు పొందటం మరువరాని రోజు మా జీవితంలో ఆ రోజు ది.14-3-96 గురువారం రాత్రి 8, 9 గంటల మధ్య ఈ దినం నేను మరువలేని అపూర్వమైన దినం. ఆ తరువాత 15-3-96 శుక్రవారం తెనాలి తిరిగి వచ్చిన తరువాత నుండి ఈ రోజువరకు లోగడ గుడ్డ కట్టిన ఆ అరికాలు బాధ అంటూలేకుండా పోయింది. మరియు మనశ్శాంతిగా ఉంది. లోగడ ప్రతివిషయం పట్ల ఆందోళనగా ఉండేది. అలాంటిది మాకు తెలియని ధైర్యం మాలో కలిగి ఏటైముకు ఎలా జరగాల్సింది అలా జరుగుతుందిలే! అని ఆత్మ విశ్వాసం నాలో కలిగింది. వీలైనంత త్వరలో మరియొకసారి శ్రీ శరత్‌బాబు గారిని దర్శించుటకు ఆకాంక్షిస్తున్నాను. మరి వారి ఆశీస్సులు నాకు కావాలి కదా! జీవితంలో నా యీ 61 సం.ల వయస్సులో సాక్షాత్ భగవంతుని దర్శించిన అనుభూతి మరువలేను. నాకు ఇలాంటి అవకాశం కలుగజేయుటకు అంటే తిరుపతి తీసుకు వెళ్ళిన మిత్రులు డాక్టర్ శ్రీ శ్రీనివాసాచార్యులు గారికి వారి శ్రీమతి గారికి మరియు రెండవసారి ఇంటర్వ్యూకు వెళ్ళుటకు మాలో స్పందన కలుగజేసిన తిరుపతి వైఖానశ ఆశ్రమం మేనేజర్ శ్రీ ప్రభాకరాచార్యులు గారికి నా హృదయ పూర్వక నమస్కారములు తెలియజేసుకుంటూ శ్రీగురుదేవులు శరత్‌బాబూజీ గారి అనుగ్రహం అన్ని వేళలా మా అందరి పట్లా ఉంటుందని మనసారా కోరుకుంటూ వారి ఘనమును నిత్యము తలచుకుంటూ ఉండే అనుగ్రహం కూడా వారు నాకు ప్రసాదిస్తారని ధృడముగా విశ్వసిస్తూ నా ఈ అనుభవమును మనసారా భక్తులందరికీ చెప్పుకుంటున్నాను.

ఇట్లు
మునునూరు కోనయ్యచౌదరి.

## లక్ష్మణాంశ

22.4.98న తిరువణ్ణామలైలో గురూజీ రాత్రి పదిగంటల సమయంలో దర్శనమిచ్చారు. దర్శనాలు పూర్తిమైన తరువాత కొంత విరామ సమయం ఏర్పడింది. రాత్రి 12 గంటలు దాటబోతుంది. "గురూజీ" ఏదైనా చెప్తారు. చెప్తే వినాలనే కుతూహలంతో అంత రాత్రైనా "గురూజీ" సత్సంగం కోసం ఆత్రుతపడుతు దాదాపుగా 15మంది పాశ్చాత్యులు ఎదురుచూస్తున్నారు. వారి ఉత్సాహానికి తగిన విధంగానే "గురూజీ" వచ్చి అందర్ని కలయజూచారు. చీకటియైనప్పటికి వారి మోము పున్నమినాటి చంద్రుని వంటి తేజస్సుతోవుంది. మాణిక్యమంతటి వెలుగు స్పష్టంగా వారి కన్నుల్లో జ్యోతకమైతున్నది. ఈ అనుభవం అక్కడున్న వారందరికి గోచరించింది. పాశ్చాత్య తాత్త్విక చింతనను పుక్కిటబట్టిన ఓ వ్యక్తి.

"గురూజీ" అని సంబోధించాడు.

"Yes" అని గురూజీ బదులు పలికారు.

అంతే ధారావాహికంగా ఎన్నో శంకలు, అతడడగటం గురుదేవులు సందేహ నివృత్తిచేసి, విషయాన్ని సమన్వయ పరుస్తున్నప్పుడు, అతడు పొందిన సంతృప్తి అంతింతకాదు. అలాంటి ఆనందంలో చేతులెత్తి గురుదేవులకు నమస్కరించుకోవటం, వెల్లుబికిన తన్మయత్వం, అనంతమైన తృప్తి ఆ పాశ్చాత్యుని వదనంలో కన్పించింది. మొదట విషయ వాసనలను గూర్చి అడిగాడు ఆ తరువాత, సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యాదులను గూర్చి అడిగాడు. అటు పిమ్మట వేదాన్త విషయాలు, ఉపనిషద్వాక్యములను గురించి అడిగాడు. మహామహోపాధ్యాయులైన గురుదేవులు సవిస్తరంగా ఉదాహరణ పూరకంగా వివరించేసరికి 3 గంటలు దాటింది.

నాకేమో ఆంగ్లము అంతగా తెలియదాయే, ఆనాటి రాత్రి అందరు రసానుభూతిని పొందినవారే. నాలాంటి వ్యక్తే మరొకరున్నారు. ఆమెకుగూడా ఆంగ్లము అర్థముకాదు. ఆమెవరోకాదు నా ఇల్లాలే. 3-00 గంటలు దాటేసరికి నాకు నిద్ర ముంచుకొస్తుంది. "గురూజీ" కి ఎదురుగా అతిసమీపంగా కూర్చొని ఉన్నాను. అర్థంకాక పోయినా ఆరజనీకరుణ్ణిచూస్తూ నేను ఆనందాన్ని అనుభవిస్తున్నాను. వాస్తవానికి అక్కడున్నది ఆనంద స్వరూపమే. తెలియకుండానే రెప్పలు వాలిపోతున్నాయి. ఇందులో నా ప్రమేయమేమీ లేదు. బలవంతంగా వాలుతున్న రెప్పల్ని పైకెత్తే ప్రయత్నం సాగుతుంది నాలో. సత్సంగం పూర్తైంది. "హమ్మయ్య" ఇంటికి వెళ్ళి హాయిగా నిద్రపోవచ్చునుకొనినాను. మూసుకుపోతున్న రెప్పలకు ఈ విషయం తెలిసి నాకు కొంచెం సహకరించాయి. పాదాభివందనం చేసుకొని బయటికొచ్చాను.

ఇంతలో నా యోగం పండిందికాబోలు, మా S.V.L. నారాయణరావుగార్ని, మా సాయిప్రసాద్ గార్ని, "నన్ను" గురూజీ తమగదికి రమ్మన్నారనీ కబురొచ్చింది. వచ్చే నిద్రను ఆపుకోలేను, "గురూజీ" సన్నిధిని వదలుకోలేను. "గురూజీ" పైనే భారమేసాను. వారి ముందు తూగితే ఎక్కడ నన్నింటికి వెళ్ళిపొమ్మంటారనే భయం వెన్నంటింది. నిద్రమొహంతోనే "గురూజీ" గదిలోకి ప్రవేశించి పాదనమస్కారం చేసుకున్నాను. నా అవస్థ గమనించినట్లున్నారు గురుదేవులు. ఒకే ఒక చూపు నావైపు తదేకంగా కొద్దిసేపు చూచారు. మళ్ళీ నేను గురుదేవుల గదిని వదిలి బయటకొచ్చేసరికి 5.30 గం. దాటింది. తెలవారబోతుంది. బయటకొచ్చిన తరువాత గాని నాకు తెలియలేదు. నాలో గురువుగారు "లక్ష్మణాంశను" ప్రవేశపెట్టినారని. అంతకు మునుపున్న నిద్ర ఏమైందో, ఎటుపోయిందో, తెలియలేదు. ఆయన సన్నిధిలో నిద్రా! ఎటు మాయమైపోయావు ఇంతసేపు అనుకొన్నాను. 6 గంటలకు నవ్వుతూ ఇంటికి చేరాను. రాత్రి అనుభవాలను, సత్సంగ విశేషాలను గుర్తుకు తెచ్చుకుంటూ.

నమస్కారములతో
గురుచరణ దాసుడు.

## జోరున వాన - ఆగని సత్సంగ వేల

ది. 12-4-98న హైదరాబాద్ లాలాగూడాలో సాయిబాబా మందిరాన్ని ప్రారంభించడానికి అరుదెంచిన సద్గురు సాయినాథుని శరత్ బాబూజీని దర్శించుకొని తరించటానికి, రాష్ట్రం నలుమూలల నుండి ఎందరో సాయి భక్తులు, గురుబంధువులు ఆర్తితో జంటనగరాలను కలకలారావములతో సాయిమయం చేసినారు. ఆనాటి ప్రారంభోత్సవానికి వచ్చిన వారిలో వైజాగ్ నుండి గురుబంధువు శేఖర్ గారు కూడా రావటము జరిగినది. గురుబంధువులతో జరిగిన సంభాషణలో, తెనాలి నుండి వచ్చిన శ్రీనివాస్ గారు వైజాగ్ లో వున్నారని తెలిసి వారి నెంబరు తీసికొని శేఖర్ గారు హైదరాబాద్ నుండి వైజాగ్ రాగానే వారిని పరిచయం చేసుకోవటం జరిగింది. వారి కోరికపై శ్రీనివాసు గారు శిరీష అక్కగారి యింట్లో జరిగే సత్సంగంలో పాల్గొనటం జరిగింది.

స్టీలు ప్లాంట్లులోని పదిమంది మహిళలు కలిసి సాయం సంధ్యలో క్వార్టర్సు మధ్యలో చెట్ల నీడలలో రోజు జరిపే కాలక్షేపం కబుర్లకు బదులు మనము రోజు ఆసమయంలో బాబా చరిత్ర గురించి అధ్యయనం, పూజ, భజన ఎందుకు చేసుకొనకూడదు? అన్న ఆలోచన శ్రీమతి లలిత గారి మిత్ర బృందమునకు చర్చకు వచ్చి భజన కార్యక్రమమును కొనసాగిస్తున్నారు. తెనాలి శ్రీనివాసుగారు గురించి తెలిసిన శ్రీమతి లలితగారు, శిరీష అక్కగారింటికి వచ్చినట్లు తెలుసుకొని "మేము ఈ మధ్యనే స్టీల్ ప్లాంట్ లో మాయింటివద్ద బాబా భజన, పూజ చేసుకుంటున్నాం. అందరం కలిసి సత్సంగం ప్రారంభించాలి అనుకుంటున్నాము. గురువుగారి గురించి, బాబాగురించి చెప్పగలిగిన గురుబంధువు శ్రీనివాసరావుగారు వస్తే బాగుంటుంది, వారిని అడగండి" అని శిరీష గారిని కోరారు. అది కార్య రూపం దాల్చటంతో అందరికీ అనువైన టైము ఆదివారం సాయంత్రం గం.4.30ని,లు గా నిర్ణయింపబడింది.

ది. 14-6-98న క్రొత్తగా సత్సంగ కార్యక్రమము మొదలు పెట్టినరోజునే యాదృచ్ఛికముగా నేను వైజాగ్ వెళ్ళటము తటస్థించింది. శ్రీనివాసరావుగారితో కలిసి మొదట శిరీష గారింటికి వెళ్ళటం అక్కడినుండి స్టీల్ ప్లాంట్ లో నూతనంగా ప్రారంభించే సత్సంగ కార్యక్రమం వద్దకు వెళ్ళాలి. "జోరున వానకురుస్తోంది". ఎలా వెళ్ళటం? అని సందేహించాము. తర్జన భర్జన వదిలి స్కూటర్ పై అంతటి వానలోనూ తడుస్తూ స్టీల్ ప్లాంట్ లో వారి క్వార్టర్స్ వెతుక్కుంటూ వెళ్ళాము. అనుకున్న ప్రకారం గురుబంధువులందరూ వచ్చారు. ఆ జడివానలో కూడా ఏ ఆటంకం కలుగకుండా యధావిధిగా శ్రీనివాసరావుగారి చేత సత్సంగము ప్రారంభించబడింది. ఇదంతా గురువుగారి ఏర్పాట్లు కాక మరేమిటి!

బాబా కార్యక్రమం జరిపే వాళ్ళలో ఆర్తి, కోరిక, సంకల్పం, ధృడముగా ఉంటే వర్షం ఏమీ ఆపలేదు అనిపించింది. ఇది "గురుకృప" పత్రికకు లభించిన ఒక సంఘటన.

ఆనాటి సత్సంగములో శ్రీనివాసరావు గారు ఎన్నో ముఖ్య విషయములు చెప్పారు. అతి కొద్దికాలంలో గురువు గారిని గురించి వ్రాసిన వ్యాసములు, గురుబంధువులు వద్ద వున్న సత్సంగ ఆడియో క్యాసెట్స్, గురువుగారితో అత్యంత సన్నిహితముగా మెలిగిన గురు బంధువులు చెప్పిన అనేక సత్సంగ విషయాలను అవగాహనచేసుకొని గురువుగారినే బాబాగా భావించి అనన్యంగా సేవిస్తూ వారే నాచేత ఈ విషయములు చెప్పిస్తున్నారు అనే భావలోనే శ్రీనివాసరావు గారి సత్సంగం జరిగింది.

సత్సంగం మొదటి రోజు, అందులోను అందరూ క్రొత్తవారు, బాబాగురించి, గురువుగారి గురించి వారికి ఎలా చెబితే అవగాహన అవుతుందో ఆ రీతిలో ప్రారంభించి "మనమంతా" బాబా బిడ్డలం. ఈ రోజున మనమంతా ఒకచోటకి చేరి బాబాగురించి, గురువుగారి గురించి మాట్లాడుకుంటున్నాము అంటే వారితో ఋణానుబంధము వుండటంచేతనే. అది ఈ జన్మలోనే కాదు పూర్వజన్మలో కూడా, వారితో మనకు పరిచయము, కలిసి జీవించటము జరిగి ఉంటుంది. దాని పర్యవసానంగానే మరలా ఈ జన్మలో కూడా వారి వద్దకు చేర్చబడినాము.

మామూలుగా మనం మన పెద్దలు ఆచారముగా చేస్తూవస్తున్న దేవతారాధన వాళ్ళ అడుగు జాడలలో చేస్తూ వుంటాము. మన శాస్త్రములు చెప్పినదాని ప్రకారము దేవతారాధన పూర్తి అయిన తర్వాత ఆ భగవంతుడే మనకు ఒక సద్గురువుని చూపిస్తాడు. అది తెలుసుకొని మనము వారినే నమ్ముకొని వారి బాటలో నడవటం జరగాలి. మనకు ఒక ప్రదేశము చేరవలెనంటే దానికి నాలుగు దార్లు ఉంటాయి. మనము ఏది దగ్గరి దారో తెలుసుకోవాలి. అంటే ఒకసారి నాలుగు దార్లలో ప్రయాణం చేయాలి. అప్పుడు కానీ ఏది దగ్గిర దారో మనకు తెలియదు. అలా కాకుండా ఒకసారి వెళ్ళి తెలుసుకొన్న వారు చెప్పిన మాటలని బట్టి దగ్గిర దారి ఏదో తెలుసుకొని ఆ దారిలో ప్రయాణం చేయవచ్చు. ఆదారిలో మన సద్గురువైన శరత్‌బాబూజీ నిరంతర అన్వేషణతో మనకు ఒక బాటను చూపుతూ మనలను అతి దగ్గిర దారిలో సులువుగా వెళ్ళేమార్గం ద్వారా బాబా వద్దకు చేరుస్తున్నారు. ఆ విధంగా ఆలోచిస్తే గురువుగారు చూపిన బాటే సాయి బాట. అదే సాయిపథము. మన బాబూజీ చూపిన భక్తి పథము. ఆనాడు బాబా కూడా తన గురువునే దైవంగా భావించి తన గురుస్థానమైన షిరిడీలో మహా సమాధి వరకు గడిపారు.

బాబా గురించిన విశ్లేషణలతో వారు పలికిన ప్రతి పలుకు ఒక శృతి వాక్యముగా తీసుకొని "వారంతా నాకు అల్లా అప్పచెప్పిన బిడ్డలు" అన్నారు నాడు బాబా. మీరంతా నాకు బాబా ప్రసాదించిన ప్రసాదం అంటారు శ్రీ గురూజీ నేడు.

కాబట్టి మనమందరమూ నేడు బాబా అనుగ్రహముతో మన సద్గురుపైన శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ వద్దకు చేర్చబడినాము.

ఒకరు ఒక జీవిత కాలములో చేయలేని అధ్యాత్మిక పరిశోధన గురూజీ చేయగలిగారు అనే దానికి నిదర్శనం వారు వ్రాసిన అసంఖ్యాకమైన వ్యాసములే. వాటిలో "సాయి భక్తి సాధన రహస్యము" ఒక అపూర్వ పుస్తకము అని వివరిస్తూ దానిలో "అసలైన సాయిబాట - అందరికి రాచబాట" వ్యాసము చదివి వివరణాత్మకముగ చెపుతూ ఉంటే క్రొత్త వారు కూడా బయట కురుస్తున్న పెద్ద వర్షాన్ని, పరుగులు తీస్తున్న సమయాన్ని కూడా మరచిపోయి శ్రీనివాసరావుగారి పలుకులు శ్రద్ధగా ఆస్వాదించారు.

'విస్పందన'

## ఫోటోనే వారు

గురుకృపను పొందిన వారిలో శ్రీమతి శాఖమూరి సీతారావమ్మగారొకరు. ఈమె బుట్టిపాలెంలో జరిగే సత్సంగాలకు వస్తారు. ఆమెను గురువుగారు ఎలా అనుగ్రహించారో, వారి సన్నిధిలో పొందిన అనుభవాలను ఆమె వ్రాత పూర్వకంగా వ్రాసి ఇచ్చిన లేఖ యొక్క సారాంశాన్ని గురుబంధువులకు తెలియజేయటానికి సంతోషిస్తున్నాము.

నేను శిరిడీకి వెళ్ళినప్పుడు గురుదేవుల వద్దకు దర్శనార్థం వెళ్ళినాను. అప్పటికి వారిని గురించి నాకు అంతగా తెలియదు. అందరితోపాటు నేను వెళ్ళాను. గురుదేవుల వద్ద నేను కూర్చున్నాను. విభూదినందిస్తూ నీకు మంచిరోజులు వస్తాయి అని అన్నారు. ఆ తరువాత వారి ఫోటో పెట్టి ఇంట్లో పూజ చేస్తూండేదాన్ని. ఒక రోజు మా ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. సమయానికి డబ్బు అందలేదు. నేను పూజిస్తున్న గురువుగారి ఫోటో ముందు కూర్చుని నా పరిస్థితిని అక్కడ వారికి వివరించాను.

ఆరోజు రాత్రి నాకు నిద్రలో గురువుగరు ఫోటోలోంచి బయటకొచ్చి 25 కి.గ్రా.ల బియ్యం తీసికొచ్చి అలమరాలో పెట్టి మరలా ఫోటోలోకి వెళ్ళినట్లుగా కలవచ్చింది. మెలుకువ వచ్చి చూస్తే ఏమీలేదక్కడ. మరుసటి రోజు ఉదయం కేవలం ముఖ పరిచయమేగాని, నేనెన్నడూ ఆ అబ్బాయితో మాట్లాడి ఎరుగను. ఆ అబ్బాయి రోడ్డు మీద కనబడి నేను వేరే వాళ్ళకు బియ్యాన్ని పంపుతున్నాను. మీక్కూడా కావాలాని అడిగితే పంపించమన్నాను. ఏం పంపిస్తాడో అనుకున్నాను. ఆ రోజు సాయంకాలమే ఆ అబ్బాయి 25 కి.గ్రా.ల బియ్యాన్ని పంపించాడు. డబ్బులు గూడా వెంటనే అడక్కుండా తర్వాత ఇవ్వచ్చులే అని అన్నాడు. ఆ విధంగా నా పరిస్థితి గురువుగారి ఫోటో ముందు కూర్చుని చెప్పటం నా సమస్యకు పరిష్కారం ఇలా అయినదని తలంచాను.

మరొకసారి శరత్‌బాబుగారు తిరుమలకు వచ్చినప్పుడు ఆయన దర్శనార్థమై నేను వెళ్ళాను. గురువుగారి దగ్గర కుర్చొని వారిని చూస్తుంటే నాకు బాబాను చూచినట్లుగానే అన్పించింది. నా మనమరాలికి సంతానం కావాలని అడిగితే ఆయన సరేనని తలూపారు. ఆ తరువాత పిల్లలను ఇవ్వటమనే కోరిక తీరింది. ఈ విధంగా నా సమస్యలను వారికిగాని, వారి ఫోటో ముందు కూర్చుని చెప్పుకుంటే నాకు పరిష్కారమౌతుంది. ప్రస్తుతం నేను ఫోటోగా భావించట్లేదు. బాబాగా గురువుగారే ఉన్నట్లుగా భావించి నా బాధలు చెప్పుకుంటాను.

శాఖమూరి సీతారావమ్మ
బుట్టిపాలెం సత్సంగ కేంద్రం, తెనాలి మండలం.

# ఆ చేయి ఎంత హాయి


విచిత్రంగా, వింతగా, వినూత్నంగా, జనించిన ప్రశ్నొకటి ఎన్నో ఏళ్ళుగా నీడలా వెన్నాడుతూ వెక్కిరిస్తున్నది. నన్ను చూచినప్పుడు నాలో ఆలోచన పెరిగినప్పుడు, ఇన్నేళ్ళ నీ జీవితానుభవంలో, జీవన మథనంలో నా ప్రశ్నావళికి సమాధానం దొరికిందానే? ప్రశ్న నన్ను ఎగతాళి చేస్తున్నది. నీ పరిశోధనల అలలు ఇప్పటి వరకు వేలాదిగా ఒడ్డును తాకుతునే ఉన్నాయి. మళ్ళీ వెనక్కు మళ్ళుతున్నాయి. "ప్రశ్న" ప్రశ్నగానే మిగిలి పోయింది. నిరంతరాన్వేషణలో ఎన్నో మార్గాలు పయనించి మరల మొదటికే చేరేసరికి బలమెక్కిన ప్రశ్న మరికొంత జవసత్వాలను పెంచుకొని నిర్భయంగా నిలదీసి అడుగుతున్నది. ఏమనంటే నీకు సమాధానం దొరికిందా? దాని ముందు తల దించుకొని నా ఓటమిని అంగీకరించాలంటే నా అహంకారం అందుకు అంగీకరింపనీయలేదు. దాన్ని గెలవాలని నానా ప్రయత్నాలు చేసి, నానా మార్గాలు వెదుక్కొని బలాన్ని నింపుకొని ఎదురెళ్ళిన ప్రతిసారి వాలిచేతిలో ఓడిపోయిన సుగ్రీవుని అనుభవమే మిగిలింది. మకరినోట చిక్కిన గజేంద్రుని అవస్థే నాకు పట్టింది. వాలి బారినుండి సుగ్రీవుణ్ణి కాపాడిన రాముడు నాకోసం మళ్ళీ పుట్టాలి. మకరి బారినుండి కరిని రక్షించేందుకై అలవైకుంఠపురాన్ని వదలి తరలి వచ్చిన శ్రీ మహావిష్ణువు నాకొరకుగా పుట్టాలి. వెంటాడి వేధిస్తున్న ఈ "ప్రశ్న"ను భారత సంగ్రామానంతరం అంపశయ్య పై విశ్రాంతి పొందుతున్న శాంతనవుని ధర్మరాజు అడిగిన ప్రశ్నలలో ఉందేమోనని చూచాను. "ప్రశ్న" నన్ను చూచి జాలిగా నవ్వింది. ధర్మరాజుని ప్రశ్నించిన యక్షుడేమైనా ఇలాంటి "ప్రశ్న" అడిగున్నాడేమోనని పుటలు తిరగవేస్తుంటే 'నన్ను' వేధిస్తున్న "ప్రశ్న" కోపంగాను, నవ్వుతో నిండిన విజయగర్వంతోను నావంక చూస్తున్నది. నన్ను గమనిస్తున్నప్పుడల్లా నాలో పట్టుదల, పరిశోధనా సరళి జవిళిపులకంగా పడుగు పేకలా, పెనవేసుకొని రెట్టింపు ఉత్సాహంతో ప్రపంచపు పోకడలను, మనుష్యుల మనస్తత్త్వాలను చూస్తుంటే "నన్ను" వెన్నుతట్టి వెంటాడుతున్న "ప్రశ్న" మేరు పర్వతంగా పెరిగి పోతుంది. వామనులా జనించిన "ప్రశ్న" వామనావతారంలా నాలోని అనంతాన్ని ఆక్రమించింది. నా నిర్వీర్యత దానికి బలాన్నిస్తుంది. నా బలహీనతే దానికి బలాన్నిస్తుందని ఎంతో కాలానికి గమనించాను. నేను గమనిస్తున్నానని, మలుపు మార్గం వైపుకు రాబోతున్నామోనని గమనిస్తున్న "ప్రశ్న" నన్ను తనలో ఇముడ్చుకోవాలని తన విశ్వరూపం నా ముందు ప్రకటించి కనపడిన దానినంతా కబళిస్తు, వాయువేగంతో ముందుకురుకుతున్నది. ఇన్నేళ్ళు నా శ్రమ, నా అన్వేషన, నేటితో సరి ప్రవాహ వేగంలో సంజీవి పుల్లవంటి వాడనని భావించిన నా గర్వము, సర్వము, ఖర్వము కాబోతున్నది. ప్రవాహవేగానికి ఎదురీదవలెనను నా వూనిక సడలిపోయి అనుగుణ్యంగా కొట్టుకొని పోబోయే పరిస్థితి ఏర్పడబోతుంది. కాలగర్భంలో "నేను" అందరిలా అంతం కాబోయే సమయం ఆసన్నమైంది. ఇప్పటివరకు ఎందరినో తన గర్భవాసాన నింపుకొంది. "నేను" ఇప్పుడు అంతేనేమో. దాని పాలబడి "నేను" నలిగి పోవాల్సిందేనా? నా గమ్యమేమిటో? నా గమనమేమిటో! తెలియకుండానే తుంకణములతో అంతరించిపోవాలా! నా లక్షమేమిటో గమనించకుండానే సమసిపోతున్నాననే దుఃఖము నన్నావరించి కంపితుణ్ణి చేస్తున్నది. విలవిలలాడి పోతున్నాను. ఎటూ చెప్పలేక మూగనై పోతున్న నన్ను ఉద్ధరించే నిమిత్తంగా కరుణాంతరంగ హృదయుడు, ధర్మమూర్తి, జగదోద్ధారకుడు, ఆనంద రూపధారి, అనంత బ్రహ్మాండవ్యాప్తి దివ్య తేజోమయుడు, అవ్యాప్తుడు, ప్రకాశ భాసిత, ఆదితుడు, నగుమోము, వజ్రాలవంటి పలువరుస, పరమయోగీంద్రుడు సైతము చూచినంతనే నమస్కరించే వదనం నాముందాగింది. భయంతో వణికి పోతున్ననాపై ఆ కరుణామయుని "కరస్పర్శ" శిరముపై పడింది పూర్వపు ఆందోళన అణగారిపోయి మరో మధురానుభూతి ప్రారంభమైంది. క్షణ కాలం నాముందు కన్పించిన బాబా రూపం క్రమక్రమంగా మరో రూపంగా మారి పోయింది.

అంగుళీ మాళుణ్ణి, అనుగ్రహించటానికై అరుదెంచిన బుద్ధ భగవానుని పగిదివోలే: ఉపాసనీ బాబాను రక్షించిన సద్గురు సాయినాథుని వోలే: ఆర్తుల ఆర్తిని బాపి ఉద్ధరించిన క్రీస్తులా! కబీరుకు కలిగిన వివేక వైరాగాలను ఉద్దీపింపచేసి మార్గాన్ని చూపిన నిరంజన నింపతునిలా! నామ దేవుని మార్గాన్ని సుగమం

చేయటానికి దర్శనమిచ్చిన విశోభాకేశవునిలా! నా ముందాగింది ఓ అపురూపమైన రూపం. నా ముందు నిలిచిన రూపాన్ని చూచిన మరుక్షణంలో కాలాన్ని సైతం కబళించే మృత్యువులా! నన్ను కబళించబోయే "ప్రశ్న" తన రూపాన్ని కుంచించుకుంటున్నది. విశ్వాంతరాళాల్లో తనకెక్కడ చోటు లేని తావుకు వెళ్ళి పోతుందాన్న రీతిగా కనుమరుగై పోయింది. ముంగీసను చూచిన పాము పగిదిలా! నాకు భయం స్థితినుంచి అభయం అనే స్థితి కలిగింది. ఆందోళన, అలజడులనుంచి, రక్షణ లభించింది. ఆఘాతంలోకి నెట్టి వేయాలనే ప్రయత్నాలు ఆ దివ్య మంగళ తేజోమూర్తి ముందు విఫలమైనాయి. ప్రహ్లాదుని హింసించాలనే హిరణ్యకశ్యపుని ప్రయత్నాల వలె ఉంది నా వైఖరిప్పుడు.

ప్రపంచంలోని సౌందర్యమంతా పోతపోసి మరింకెవ్వరికి ఇవ్వగూడదని తలంచి బ్రహ్మ తన సృష్టి చాతుర్యానికిదే తొలి తృప్తియా అన్నట్లుంది ఆ సౌందర్యం. శతకోటి బాసురభాను తేజములేకమైన కాంతి పుంజమా ఆ వదనంలోని వెలుగు నాపై ప్రసరిస్తున్నది. వినీలాకాశం వైఖానస వీధిలో వెలుగొందు తారాధిపతి చలన రహితుడై ఆ నేత్రాలలో కాపురమున్నాడా! అన్నంత చలువదనం నాపై వర్షించింది. కోటేరువంటి నాసిక, శ్రీకారము లాంటి నోరు, కంబు కంఠము, ఆజాను బాహువులు, పద్మ దళాలు వంటి కనుదోయి, ఎగుభుజములు, పీన వక్షస్థలము, కనకంబు వంటి మేనిఛాయ, సరిగమలను అవలీలగా వీణపై మీటగల చేతి వ్రేళ్ళు. ఇలా ఎంత వర్ణించినను అదంతా ఆయనకు తక్కువే. వాస్తవమైన రూపాన్ని చూచి ప్రస్తుతించలేని అసమర్థుణ్ణి. వ్రాయలేని విద్యావిహీనున్ని. ఆయనప్పటికి కరుణించి దర్శనమిచ్చారు.

ఆయనలోని మహత్తును గుర్తించి నన్ను వేధిస్తున్న "ప్రశ్న" పారిపోయిందిగాని, ఆ మహిమాన్వితుని మహిమను గుర్తించలేని మందమతిని. మొదట సౌందర్యానికి దాసుడనై తృప్తిగా తేరిపార చూచాను. తృప్తిగా చూడగల్గినందుకు నా ఎదుట సాక్షాత్కరించిన దైవం నావైపు అందంగా ఓ చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు ఎంత అందంగాను, ఆనందంగాను, ఉందని ఆనందించాను గాని, అందులోని, ఆంతర్యాన్ని, అంతరార్థాన్ని, మర్మార్థాన్ని అప్పుడు నేను అర్థంచేసుకోలేకపోయాను. కనుల వెంట నీరు, ఆనందం తట్టుకోలేక వస్తుంది. ఆ నీటి చారికలు అడ్డుపడుతున్నందున అనంతమైన ఆ సౌందర్యాన్ని జుఱ్ఱుకోలేక పోయాను.



సశేషం

(వెంటాడి వేధించిన ప్రశ్నలేమిటి? వాటిని విశదీకరించిందెవరు?

తృప్తి ఎలా కలిగింది మొదలగు విషయాలు వచ్చేసంచికలో).